# రాంగ్ రూట్.. ప్రమాదకరం

- రామాటాకీస్ రోడ్డులో రాంగ్ రూట్‌లో వాహనాల రాకపోకలు
- చుట్టూ తిరగలేక.. షార్ట్‌కట్‌లో వెళ్తున్న వాహన చోదకులు



రామాటాకీస్ రహదారిలో స్టాపర్ బోర్డులతో మూసివేసి ఉన్న శ్రీనగర్ రోడ్డు





రామాటాకీస్ రోడ్డులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న ఆటో, ద్విచక్ర వాహనాలు

**సీతంపేట:** రామాటాకీస్ రోడ్డులో వాహన చోదకులు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. బుల్లయ్య కళాశాల రోడ్డు నుంచి ద్వారకానగర్ వైపు వెళ్లే మార్గంలో శ్రీనగర్ కూడలిలో(ఎస్వీఆర్ ట్రావెల్స్ ఎదురుగా) స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయడంతో చుట్టూ తిరిగి వెళ్లే ఓపిక లేక కొందరు వాహన చోదకులు దగ్గర దారి కావడంతో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. ద్వారకానగర్ నుంచి శ్రీనగర్ మీదుగా రామాటాకీస్ కూడలికి వచ్చే మార్గాన్ని మూసివేయడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిత్యం రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నాయి.

### శ్రీనగర్ రోడ్డు మూసివేతతో ఇబ్బందులు

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు రామాటాకీస్ రహదారి నుంచి శ్రీనగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు డివైడర్ వద్ద స్టాపర్ బోర్డులతో మార్గాన్ని మూసివేశారు. అప్పటి నుంచి వాహన చోదకులకు కష్టాలు మొదలయ్యాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం సెంటర్, రేసపువానిపాలెం, వినాయక నగర్, తులసీపేట ప్రాంతాల వారు ద్వారకానగర్ వెళ్లడానికి రామాటాకీస్ కూడలికి ముందున్న శ్రీనగర్ రోడ్డులో ప్రయాణాలు సాగిస్తుంటారు. సీతమ్మధార, సత్యం సెంటర్ నుంచి వచ్చే వాహనాలు రామాటాకీస్ కూడలి వరకు వెళ్లి యూ టర్న్ తీసుకుని శ్రీనగర్ మీదుగా ద్వారకానగర్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామాటాకీస్, శ్రీనగర్ నుంచి సత్యం సెంటర్‌కు.. అటు మద్దిలపాలెం వైపు వెళ్లే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు ట్రావెల్ బస్సులు బారులు తీరి ఉన్నా... వాటి పక్క నుంచి ప్రమాదకరంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. సరైన మార్గంలో వస్తున్న వారు వీరిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు.

### ట్రావెల్స్ బస్సులతో ట్రాఫిక్ సమస్యలు

రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు బారులు తీరుతుంటాయి. ఇక్కడ పికప్ పాయింట్ ఏర్పాటు చేయడంతో ప్రతి రోజూ సాయంత్రం నుంచి బస్సులు ఒకదాని వెనుక మరొకటి క్యూ కడుతుంటాయి. ఇదే సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం రహదారుల నుంచి సీతమ్మధారకు వెళ్లే వాహనాలతో ఈ మార్గమంతా రద్దీగా ఉంటుంది. రామాటాకీస్ రోడ్డులో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు ప్రతి రోజూ 50 నుంచి 60 వరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి బారులు తీరుతూ ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నాయి. వారాంతపు రోజులు, సెలవు దినాలు, పండగ రోజుల్లో ట్రావెల్స్ బస్సుల వల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. ట్రావెల్స్ బస్సుల పికప్ పాయింట్‌ను తొలగించాల్సిన పోలీస్ యంత్రాంగం వారికి మరింత మేలు చేసేలా శ్రీనగర్ రోడ్డు వైపు వెళ్లకుండా స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. పోలీస్ యంత్రాంగం స్పందించి రామాటాకీస్ రోడ్డులో రాంగ్ రూట్ ప్రయాణాలను నియంత్రించి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ట్రాఫిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్



కార్‌కు లాక్ వేస్తున్న ఎస్ఐ భాస్కరరావు



గురుద్వారా వద్ద ద్విచక్ర వాహనానికి లాక్ వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

- రాంగ్ పార్కింగ్ వాహనాలపై కొరడా
- 30 వాహనాలకు జరిమానాలు

**సీతమ్మధార:** రహదారి భద్రత దృష్ట్యా రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానాలు విధించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ద్వారకా జోన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం గురుద్వారా నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో రాంగ్ పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లకు లాక్ వేసి ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రాంగ్ పార్కింగ్ చేసిన 30 వాహనాలకు రూ.1,035 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. చలానా చెల్లిస్తేనే ఈ వాహనాల లాక్ తీసి ఇస్తామని వాహనదారులకు సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులను ఏర్పరచడానికే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

# నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



మాధవధార వుడా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ సభ్యులు

**మద్రిపాలెం:** మాధవధార వుడా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మాధవధారలోని వుడా కమ్యూనిటీ హాల్ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. కొత్త కార్యవర్గ అధ్యక్షుడిగా బి.గోపాల్, ఉపాధ్యక్షులుగా ఎం.వి.కె.ఎస్.సూర్యనారాయణమూర్తి, ఎస్.చంద్రశేఖర్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా డి.ఎస్.వీరభద్రరావు, ఉప కార్యదర్శిగా పి.రవికుమార్, వి.లక్ష్మీనారాయణ, ఎన్.వి.ఎస్.రామకృష్ణ, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు, ఇతర సభ్యులు ఎన్నికైనట్టు వారు చెప్పారు. అసోసియేషన్‌కు సంబంధించి ఎన్నికల విషయమై న్యాయస్థానంలో కేసు నడుస్తుందని విలేకరులు ప్రశ్నించగా.. బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కోర్టును సంప్రదించామని, ప్రస్తుతం ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో ఆ కేసును వారు ఉపసంహరించుకున్నారని సభ్యులు వెల్లడించారు. 2024–26 ఏడాదికి గానూ నూతన కార్యవర్గం ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి నడింపల్లి సూర్యనారాయణ రాజు ఓ ప్రకటనలో తెలిపారన్నారు. ఈ నెల 7న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఏకగ్రీవంగా కార్యవర్గం ఎన్నిక చేసేందుకు ఈ నెల 24న కాలనీవాసులు కూడా అధిక శాతంలో మొగ్గు చూపారని ఎన్నికల అధికారి తెలిపినట్లు చెప్పారు. కాలనీ అభివృద్ధికి తామంతా కృషిచేస్తామని ఈ సందర్భంగా కొత్త సభ్యులు తెలిపారు.

# మత సామరస్యంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

**సీతంపేట:** ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలీజియస్ ఫ్రీడం (ఐఏఆర్ఎఫ్) సంస్థ 125వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ కేకు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, మత సామరస్యానికి ఐఏఆర్ఎఫ్ చేసిన కృషిని వివరించారు. మనిషికి ఉండే స్వేచ్ఛపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, మత సామరస్యానికి స్వేచ్ఛ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్.కె.మిషన్ కార్యదర్శి స్వాసం నేద్యానంద స్వామి, ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సముసిద్దీన్, రత్నకుమార్, బి.కె.రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత గాత్ర కచేరీ



మండా సుధారాణిని సత్కరిస్తున్న వంకాయల వెంకటరమణ

**సీతంపేట:** శంకరమఠంలో ఆదివారం సాయంత్రం సంగీత సుధానిధి ఇవటూరి విజయేశ్వరరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాత్ర సంగీత కచేరీ సభికులను ఆకట్టుకుంది. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మండా సుధారాణి తన మృదు మధురమైన గాత్రంతో గీతాలు ఆలపించి అలరించారు. ఈమెకు ఎం.ఎస్.ఎన్.మూర్తి వయోలిన్‌పై, వంకాయల వెంకటరమణమూర్తి మృదంగంపై, గొట్టుముక్కల వెంకటేష్ మోర్సింగ్‌పై వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా మండా సుధారాణిని ఘనంగా సత్కరించారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయం సందర్శన



పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

**డాబాగార్డెన్స్:** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆదివారం విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను పరిశీలించి విద్యార్థులు, బాలలతో మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిబిరం ఎలా జరుగుతుంది.. సిబ్బంది పనితీరు.. సమ్మర్ క్యాంపు ఏ విధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. కథల పుస్తకాలు చదివి సారాంశం వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పి.వి.నూకరాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఇన్‌చార్జి ఎల్.ఆర్.వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

**కొమ్మాది:** సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

# కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**మురళీనగర్:** కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నేత్ర వైద్యురాలు డాక్టర్ పితాని రమాదేవి సూచించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకు లేదా ఏడాదికోసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం, కనుపాపల్లో తేలికపాటి సమస్యలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కంటి ఆరోగ్యం కోసం ఏ, సీ, ఈ విటమిన్లతో కూడిన ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. టీవీ, మొబైల్, కంప్యూటర్‌లను పరిమితంగా వాడాలని సూచించారు. డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగడం, కనీసం 7–8 గంటల నిద్ర, మధుమేహం, రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవడం, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం మంచిదని వివరించారు. ఈ శిబిరంలో 194 మందికి బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పూర్వాధ్యక్షుడు సత్తి సునీల్ రెడ్డి వైద్య సిబ్బందికి పుస్తకాలు పంపిణీ చేశారు. వైద్యులను సత్కరించారు.

క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, సిహెచ్.కృష్ణమూర్తి, కె.ద్వారకానాథ్, సత్తి సునీల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.నాగేశ్వరరావు, టి.వి.రమణ, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, బోర్డు సభ్యులు వి.అప్పారావు, వై.దేముడు, ఎస్.శ్రీనివాసరావు, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు శిబిరం నిర్వహణకు సహకరించారు.

## భక్తిశ్రద్ధలతో సంకట హర చతుర్థి



లలితా పీఠంలో నిర్వహిస్తున్న విజయ గణపతి హోమం

**సీతంపేట:** సంకట హర చతుర్థి సందర్భంగా ఆదివారం లలితానగర్ శ్రీలలితా పీఠంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ గణపతికి విశేష అభిషేకం, అలంకరణ చేశారు. పలువురు భక్తులు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో విజయ గణపతి హోమం జరిపించారు. బహుళ అష్టమి సందర్భంగా ఈ నెల 31వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు చండీ హోమం, హనుమత్ జయంతి సందర్భంగా జూన్ 1న ఉదయం 10 గంటలకు పాశుపత హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

# ఆదివారం ఆటవిడుపు



మున్సిపల్ స్టేడియంలో క్రీడాకారుల సందడి



సరస్వతీ పార్కులోని మరో భాగంలో ఇసుకలో కబడ్డీ ఆడుతున్న చిన్నారులు



పిల్లలు.. పెద్దలకు ఉపయోగకరంగా వ్యాయామ పరికరాలు

**డాబాగార్డెన్స్:** అసలే ఆదివారం. ఆపై స్కూళ్లకు సెలవులు, ఇంకేముంది.. పిల్లలకు జోష్ వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం పొద్దు పోయే వరకు ఆట పాటల్లో నిమగ్నమై సందడిగా గడిపారు. నగరంలో ఎక్కడ చూసినా పిల్లల సందడే. ఏ పార్కు చూసినా.. ఖాళీ స్థలాలు.. అపార్టుమెంట్ల షెల్లార్లలో చిన్నారుల ఆటల పాటలతో సందడి కనిపించాయి. ద్వారకానగర్‌లోని డైమండ్ పార్కు, డాబాగార్డెన్స్‌లోని సరస్వతి పార్కు, పాత నగరంలోని లక్ష్మీటాకీస్ పార్క్.. ఇలా పలు పార్కులు ఆదివారం పిల్లలతో కళకళలాడాయి. ఆయా పార్కుల్లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు కుస్తీ పడుతూ మానసికోల్లాసం పొందుతున్నారు. పార్కులో మూలన కాసింత చోటుంటే చాటు యువకులు క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. మరికొంత మంది వాకింగ్ చేస్తూ కనిపించారు.



సరస్వతీ పార్కులో క్రికెట్ ఆడుతున్న యువత

# అలరించిన సినీ గీతాలాపన పోటీ



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

**మల్కాపురం:** స్థానిక వేదిక వద్ద ఆదివారం పిల్లనగ్రోవి పిలుపు పేరిట నిర్వహించిన సినీ సంగీత పాటల పోటీ అలరించింది. తెలుగు, హిందీ చిత్రాల్లోని పలు పాటలను కళకారులు పాడి ఆహుతులను అలరించారు. గాయకులు ఉరుకూటి బాబూరావు యాదవ్, నూనెల పైడిరాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అరకు, పాడేరు, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గాయకులు పాల్గొని వారు ఎంచుకున్న పాటలను పాడి ప్రేక్షకులను అలరించారు. ఒక్కో గాయకుడికి మూడు పాటల చొప్పున పోటీ జరిగింది. అనంతరం జంటగా పాటల పోటీ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలో పాల్గొనే గాయనీ, గాయకులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో కిల్లాని పైడిరాజు యాదవ్, గొంప వెంకటేశ్వర్లు యాదవ్, నమ్మి లోకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**అల్లిపురం:** వచ్చే నెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జోన్–1 పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జోన్–1 పరిధి ఈస్ట్ క్రైం ఏసీపీ వెంకటరత్నం ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్–1 ఏసీపీ వెంకటరావు ఆధ్వర్యంలో ఈస్ట్ క్రైం సీఐ ఆడమ్స్ టూటౌన్, త్రీ టౌన్, ఫోర్తు టౌన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని సుమారు 90 మంది రౌడీ షీటర్లకు అవగాహన కల్పించారు. ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీఐ ఆడమ్స్ హెచ్చరించారు.

## క్లుప్తంగా

### పైడి కృష్ణారావు మాస్టారు మృతికి సంతాపం

**సీతమ్మధార:** వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పైడి కృష్ణారావు మాస్టారు హఠాన్మరణం పార్టీకి తీరని లోటని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆదివారం సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులకు ఉన్నతమైన స్థానం కల్పించిన కృష్ణారావు మాస్టారు పదవీ విరమణ అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరి సేవలందించారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి ఎంతో చేశారని, ఆయన మృతి పార్టీతోపాటు కుటుంబ సభ్యులను తీరని లోటన్నారు. కృష్ణారావు మాస్టారు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కె.కె.రాజు భరోసా ఇచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు మాట్లాడుతూ కృష్ణారావు మాస్టారు ఎన్నో సలహాలు అందించి పార్టీ కోసం సేవలు చేశారన్నారు. ఆయన మృతి చెందడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని కోరారు.

### హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



ప్రసంగిస్తున్న కమలానంద భారతి స్వామి

**సీతంపేట:** సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న గుణ హీనత, కుసంస్కారంతో హిందూ సమాజం కుచించుకుపోయి సంకుచితమవుతోందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శంకర మఠంలో 'దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ' అనే అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేవాలయంలో దేవుడి ఎదుట కూర్చుని ఈ విషయాలపై చర్చించాలన్నారు. ప్రతి దేవాలయంలో హిందూ ధర్మ జాగరణ, హిందూ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ రక్షణ జరగాలని, దీనికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలోని స్థితిగతులు, జీవన విధానం ఆలోచనలు, పద్ధతుల్లో వచ్చిన మార్పులు, వాటి పర్యావసానం, వాటి నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సభికులు అడిగిన ప్రశ్నలకు కమలానంద భారతి స్వామి సమాధానాలిచ్చి సందేహ నివృత్తి చేశారు.

### అల్లర్లు సృష్టిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు

**సీతమ్మధార:** ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజూ ఎక్కడకు వెళ్తున్నారో పోలీసులకు తెలియపరచాలని సూచించారు. ఇతర జిల్లాలకు వెళ్లే ముందు సమాచారమివ్వాలన్నారు. రౌడీషీటర్ల దినచర్య, నడవడిక గురించి అడిగి తెలుసుకున్నారు. కేసుల్లో ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణపై అవగాహన



యారాడ బీచ్ తీరాన్ని శుభ్రం చేస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది

**మల్కాపురం:** ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ కల్యాణి గేటు నుంచి మల్కాపురం వరకు సాగిన ఈ ర్యాలీలో సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం యారాడ తీరం వద్ద అధికారులు, సిబ్బంది బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అవగాహన కల్పించారు.